క్లుప్తంగా

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



పారిజాతగిరిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రావణమాసం మూడవ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు వరలక్ష్మి వ్రత వైభవాన్ని భక్తులకు వివరిస్తూ వివిధ ఉపచారములతో వరలక్ష్మి అమ్మవారి వ్రతాన్ని జరిపించారు. 108 మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమ ఏర్పాట్లను కార్యనిర్వహణ అధికారి మానికల రాంబాబు పర్యవేక్షించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత సత్యనారాయణరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈవో దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శుక్రవారం రూ. 1,00,116 విరాళంగా అందజేశారు. తిరువూరుకు చెందిన నార్ల వెంకట సత్యనారాయణ రావు ముందుగా సతీసమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈవో మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

మానవత ఆర్థిక సాయం

కొయ్యలగూడెం: అనారోగ్యంతో బాధపడుతున్న పేద మహిళలకు కొయ్యలగూడెం మానవత శాఖ ద్వారా రూ.5 వేలు ఆర్థిక సహాయం శుక్రవారం సమకూర్చింది. ఆరిపాటి (కనకాద్రిపురం)కు చెందిన ఎస్కే గౌసుల్జామ్ పేగుకు రంధ్రాలు పడడంతో వైద్యం చేయించుకోలేని నిస్సహాయ స్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న ఐటీడీఏ రిటైర్డ్ ఎంఈవో ఎస్కే అమీర్ బాషా రూ.5 వేలు సభ్యుల చేతుల మీదుగా బాధితురాలికి అందజేశారు. సంస్థ అధ్యక్షుడు మాటూరు సుధీర్, కార్యదర్శి కంభంపాటి సాయి, కోశాధికారి ఎం.ఉమా మహేశ్వర రావు, ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, తిగిరిపల్లి చంటి, మందపాటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దాడి నిందితుడిని అరెస్ట్ చేయాలి



నిందితుడిని అరెస్ట్ చేయాలని కోరుతూ నిరసన తెలుపుతున్న దృశ్యం

చింతలపూడి: టి.నరసాపురం మండలం బందంచర్లలో దళిత యువకుడిపై దాడి ఘటనకు బాధ్యులను తక్షణం అరెస్ట్ చేయాలని మాల మహానాడు జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్ వద్ద శుక్రవారం దోషులను అరెస్ట్ చేయాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు కలకుర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత్ బంద్ సందర్భంగా జరిగిన ఘటనలో దివాకర్ పవన్ కుమార్ అనే యువకుడిపై కత్తితో దాడి చేశాడన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి, అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేసి, దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు ఎం ఇమ్మానియేలు, లంకపల్లి భాను, పండు, నాగరాజు, నత్తా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వోపీ ఎరువును సబ్సిడీపై అందించాలి

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు రైతులకు భవిష్యత్‌లో మంచి రోజులు రానున్నాయని అని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ పేర్కొన్నారు. కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రాన్ని శుక్రవారం ఆయన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో కలిసి పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో ఎస్ఓపీ ఎరువును సబ్సిడీపై అందించాలంటూ రైతులు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం అధ్యక్షులు కాకర్ల నంది, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, కాకర్ల శేషు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి బోరు నిర్మాణం

టి.నరసాపురం: నూతనంగా నిర్మించిన రామాలయానికి బోరు నిర్మాణం చేపట్టారు. ఆలయ అవసరాలు నిమిత్తం తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన సాధనాల నరసింహారావు రూ.2 లక్షలతో బోరు నిర్మాణానికి, మోటారుకు సహకారం అందించినట్లు కృష్ణాపురం గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. ఎల్లిన వెంకటరత్నం, భూక్యా రామకృష్ణ, భూక్యా రాజా నాయక్, లాలడియ రవి, దేశావతు వెంకట్, తదితరులు పాల్గొన్నారు.



చట్టాలు కఠినంగా అమలు చేయాలి



జంగారెడ్డిగూడెం రూరల్: కలకత్తాలోని సంఘటన మరెక్కడా జరగకుండా ఉండాలంటే మహిళలకు భద్రత కల్పించే ప్రత్యేకమైన చట్టాలు అమలు చేయాలి. మహిళలపై దాడులు, అత్యాచారాలకు పాల్పడే వారికి శిక్షలు కూడా త్వరగా పడేటట్లు చేయాలి. ప్రతీ కార్యాలయంలో చట్టబద్ధమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రత కల్పించాలి. మహిళలకు ప్రత్యేకంగా విశ్రాంతి తీసుకోవడానికి కార్యాలయాల్లో గదులు ఏర్పాటు చేయాలి. మహిళా ఉద్యోగులపై అసభ్యకరంగా మాట్లాడినా, వేధించినా, వెంటనే అరెస్ట్ చేసి, కఠిన శిక్షలు పడేటట్లు చేయాలి. వైద్యులు, స్టాఫ్ నర్సులపై అత్యాచారాలు జరగకుండా చట్టాలు కఠినంగా అమలు చేయాలి.
– డి.వేణుగోపాలాచారి, లక్కవరం పీహెచ్‌సీ నర్సింగ్ ఆఫీసర్

సుప్రీంకోర్టు స్పందించిన తీరు హర్షణీయం



భీమడోలు: కోల్‌కత్తాలోని మహిళా వైద్యురాలిని అత్యాచారం చేసి అతికిరాతకంగా హత్య చేయడం దుర్మార్గమైన ఘటనపై సుప్రీంకోర్టు స్పందించిన తీరు హర్షణీయం. వైద్య సేవలందించే ప్రాంతాల్లో మహిళా సిబ్బందికి రక్షణ, భద్రత చర్యలు చేపట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలో పని చేసే మహిళా వైద్యురాలు, స్టాఫ్ నర్స్‌లు రాత్రి వేళల్లో తమ విధులు నిర్వర్తించే తరుణంలో రోగుల వెంట వచ్చే వ్యక్తులు మద్యం సేవించి సిబ్బందిపై దురుసుగా మాట్లాడడం వంటి సందర్భాలు అనేకం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆసుపత్రుల్లో పని చేసే మహిళా వైద్య సిబ్బందికి రక్షణ, భద్రతలకు ప్రత్యేక చట్టం తీసుకోవాలి.
– డాక్టర్ కె.శ్రీలక్ష్మి, వైద్యాధికారిణి, భీమడోలు

ఉపాధి చట్టం పటిష్టంగా అమలు చేయాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



గ్రామసభలో జనం లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

జంగారెడ్డిగూడెం: ఉపాధి హామీ గ్రామీణ పథకంలో గ్రామ చెరువులను చేర్చి పటిష్టంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పంగిడిగూడెం, నాగులగూడెం, కేతవరం, తాడువాయి గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి హామీ గ్రామ సభల్లో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు అధికారులకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనుల్లో గ్రామ చెరువులను కూడా చేర్చి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ గ్రామ సభల్లో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్‌రావు, యాగంటి సీత, సీహెచ్ లక్ష్మీనారాయణ, పటాన్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి పంచాయతీ పాలకవర్గంతో పాటు ప్రజల సహకారం కూడా తీసుకుని ముందుకు వెళ్లాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ఎంపీడీవో జి.శ్రీను, ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం ప్రత్యేక గ్రామ సభలను నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సీహెచ్ పోతేపల్లి, నారాయణపురం, తిరుమలంపాలెం, ఐఎస్ జగన్నాధపురం, జి.కొత్తపల్లి, ఎం.నాగులపల్లి, పంగిడిగూడెం, రాళ్లకుంట, దొరసానిపాడు, ఐఎస్ రాఘవాపురం, మద్దులగూడెం, ద్వారకాతిరుమల, పి.కన్నాపురం, జాజులకుంట గ్రామాల్లో, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి కోడిగూడెం, బుట్టాయిగూడెం, మారంపల్లి, రాజుపాలెం, వేంపాడు, గుణ్ణంపల్లి, కొమ్మర, తిమ్మాపురం, గుండుగొలనుకుంట, రామసింగవరం, వెంకటకృష్ణాపురం, రామన్నగూడెం, సత్తాల, గొల్లగూడెం గ్రామాల్లో ఈ సభలను నిర్వహించారు. ద్వారకాతిరుమలలోని శ్రీవారి దేవస్థానం హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగిన సభలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పాల్గొని పలు అంశాలపై ప్రసంగించారు.

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు గ్రామ సభలు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి ముక్కంటి పలు పంచాయతీల్లో జరిగిన గ్రామ సభలకు హాజరై ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లక్కవరంలో నిర్వహించిన గ్రామ సభలో ఎంపీపీ కొదమ జ్యోతి, ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్, శ్రీనివాసపురంలో జరిగిన గ్రామ సభలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాస రావులు పాల్గొన్నారు.

జనం లేక గ్రామ సభల వెల వెల

కామవరపుకోట: ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండేందుకు ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభల్లో ఇటు అధికారులు, అటు జనం లేక కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. మండల కేంద్రమైన కామవరపుకోట పంచాయతీలో గ్రామ సర్పంచ్ కరిపోతు అనూష అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో తూతూ మంత్రంగానే సాగింది.

పరింపూడిలో వాడీ వేడిగా గ్రామ సభ



గ్రామ సభలో కూటమి నాయకులు, వార్డు సభ్యులు ఘర్షణ పడుతున్న దృశ్యం

కొయ్యలగూడెం: మండల వ్యాప్తంగా శుక్రవారం గ్రామ సభలు ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ శాఖతో అనుబంధం కలిగిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు గ్రామ సభలకు నేతృత్వం వహించారు. పరింపూడి పంచాయతీ కార్యాలయం వద్ద పశు వైద్యశాఖ అధికారి బీఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్పంచ్ ముప్పిడి విజయకుమారి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ప్రోటోకాల్ పాటించడం లేదని కూటమి నాయకులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు మాటల దాడికి దిగడంతో ఘర్షణకు దారి తీసింది. అధికారులు ఇరుపక్షాల వారిని సర్దుబాటు చేయడానికి శ్రమించాల్సి వచ్చింది. కూటమి నాయకులతో పాటు అభ్యంతరం తెలిపిన వార్డు సభ్యులను వేదికపై కూర్చోబెట్టి, సభను ముందుకు నడిపించారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ శుక్రవారం రాత్రి సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ డీఈవో బాబురావు, ఏఈవో ఎం.దుర్గారావు చినవెంకన్న జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

గర్భిణులకు సీమంతం



గర్భిణులకు సీమంతం చేసిన ఐసీడీఎస్ సిబ్బంది

కుక్కునూరు: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కివ్వాక అంగన్‌వాడీ సెంటర్‌లో సామూహిక సీమంతాల వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు కివ్వాక సర్పంచ్ మడివి రాజులు చీరలు బహూకరించారు. ఈ సందర్భంగా సీడీపీవో లక్ష్మీకుమారి మాట్లాడుతూ గర్భిణులు మందులు వాడుతూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శివయ్య, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు



కొయ్యలగూడెంలోని ఫెర్టిలైజర్స్ షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: లీగల్ మెట్రాలజీ ఏలూరు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీలలో ఐదు కేసులు నమోదు చేసినట్లు లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కొయ్యలగూడెంలోని పలుచోట్ల ఫెస్టిసైడ్స్ దుకాణాలపై ఏలూరు లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ సాయిరాం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం గ్రోమోర్‌లో రెండు కేసులు అదే విధంగా డీసీఎంఎస్ షాపులో రెండు కేసులు, బుట్టాయగూడెం మండలం కోటరామచంద్రపురం సొసైటీ షాపులో ఒక కేసు నమోదు చేశామని కుమార్ పేర్కొన్నారు. ఇవన్నీ తూనికలకు సరిపడా ఎరువులు లేకపోవడంతో కేసు నమోదు చేశామన్నారు. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ చంద్రశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్లు అప్పారావు, గణేష్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ



బయ్యన్నగూడెం పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

కొయ్యలగూడెం: బయ్యనగూడెం పీహెచ్‌సీని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ట ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. జ్వరాలతో ఎవరైనా బాధ పడుతున్నారా అని ఆరా తీశారు. సీజనల్ జ్వరాల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పీహెచ్‌సీలో ప్రసవాలు పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. పూర్తి స్థాయిలో ఔషధాలను కలిగి ఉండాలని సూచించారు. డెంగీ జ్వరాల తీవ్రత గురించి ఆశ వర్కర్లతో విస్తృతంగా ప్రజలలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఎంపీహెచ్‌ఈవో సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది ఈ సందర్భంగా రికార్డులను డీఎంహెచ్‌వోకి చూపించారు.

శ్రావణ శుక్రవారం ఆధ్యాత్మిక శోభ



బంగారు సూత్రాలు అందజేస్తున్న బొడ్డు వెంకటరమణ కుటుంబసభ్యులు

కొయ్యలగూడెం: శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవార్ల ఆలయాలు ప్రత్యేక ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. నరసన్నపాలెం వై.జంక్షన్ కనకదుర్గమ్మ ఆలయంలో అర్చకులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. కొయ్యలగూడెం, బయనగూడెంలలోని శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయాలు అదేవిధంగా కన్నాపురం, రాజవరం, గవరవరం, పొంగుటూరు, గ్రామాలలోని పలు దేవతాలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

అమ్మవార్ల ఆలయాల్లో శ్రావణ శోభ

ద్వారకాతిరుమల: శ్రావణమాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అమ్మవార్ల ఆలయాలు మహిళా భక్తులతో కళకళలాడాయి. తెల్లవారుజాము నుంచి ఆలయాలకు భక్తుల రాక ప్రారంభమైంది. సాయంత్రం వరకు ఆలయాల్లో భక్తుల రద్దీ కొనసాగింది. అనంతరం ఆలయంలో అమ్మవారికి అర్చకులు విశేష కుంకుమ పూజలు నిర్వహించారు.

శ్రీ చక్రాభిషేకాలు

జంగారెడ్డిగూడెం: శ్రావణమాసోత్సవాల్లో భాగంగా విజయదుర్గమ్మకు శ్రీచక్ర అభిషేకాలు నిర్వహించారు. విజయదుర్గమ్మ వారిని విశేష అలంకరణతో 108 చీరలతో అలంకరించి, అష్టోత్తర పూజ నిర్వహించారు. విజయ దుర్గమ్మ వారి ఉత్సవ విగ్రహమునకు జంగారెడ్డిగూడెంకు చెందిన బొడ్డు వెంకటరమణ బంగారు సూత్రములు బహూకరించినట్లు ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో రామిశెట్టి శ్రీనివాసరావు, గుడిమెట్ల యుగంధర్, అప్పలరాజు, చిన్ని జయ, తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు లక్ష గాజుల అలంకరణ

జంగారెడ్డిగూడెం: శ్రావణ మాస ఉత్సవాలలో భాగంగా నూకాలమ్మకు లక్ష గాజుల విశేష అలంకరణ చేశారు. నూకాలమ్మకు, ఉత్సవమూర్తికి పంచామృతాలు, పుణ్య నదీజలాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ, అమ్మవారి రజత వస్త్రం తయారీకి జెట్టిబోయిన సత్యనారాయణ వసుంధర దంపతులు 5 తులాల వెండిని, పాలడుగుల శ్రీను జ్యోతి దంపతులు 5తులాల వెండిని, దర్నాలకోట శ్రీనివాస్ రాణి దంపతులు 5 తులాల వెండిని, ఆలయ అభివృద్ధికి నామ ఉమామహేశ్వరరావు, దేవీకుమారి దంపతులు రూ.10,116 అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

వేలేరుపాడు: మండలంలో కొయిదా గ్రామ నిర్వాసితులు నివసిస్తున్న బుట్టాయగూడెం మండలం దొరమామిడి పోలవరం పునరావాస కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్వాసితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కాలనీలో నిర్వాసితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్వాసితులు త్యాగధనులని చెబుతూ వస్తున్న ప్రభుత్వాలు పునరావాస కాలనీలో మౌలిక సౌకర్యాలు పూర్తి చేయలేదన్నారు. ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ద్వారకాతిరుమల: స్థానిక కొత్త బస్టాండు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కామవరపుకోట మండలం ఈస్టు యడవల్లికి చెందిన ఒక యువకుడు బైక్‌పై ద్వారకాతిరుమల కొత్త బస్టాండులోకి వెళుతున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన మరో బైక్ అతడి బైక్‌ను ఢీ కొట్టడంతో పడిపోయారు. ఈ ప్రమాదంలో యడవల్లికి చెందిన యువడి కాలికి గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు.

రేషన్ డీలర్ల సమావేశం

జంగారెడ్డిగూడెం: స్థానిక లయన్స్ క్లబ్‌లో రేషన్ డీలర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీలర్లు పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మాధవ రావు, డివిజన్‌లోని 10 మండలాల డీలర్లతో పాటు చింతలపూడి, లింగపాలెం మండలాల డీలర్లు పాల్గొన్నారు.

డీలర్ల మహిళా కార్యదర్శిగా దివ్య

ద్వారకాతిరుమల: రాష్ట్ర డీలర్ల మహిళా విభాగం మొదటి విడత నియామకాల్లో ద్వారకాతిరుమల రేషన్ డీలర్ దివ్య రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. జంగారెడ్డిగూడెంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు ఆమె నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలువురు దివ్యను అభినందించారు.

చేతబడి నెపంతో దాడి చేసిన వ్యక్తుల అరెస్ట్

ద్వారకాతిరుమల: చేతబడి నెపంతో వృద్ధురాలిపై దాడి చేసిన ముగ్గురిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. వివరాల ప్రకారం. మండలంలోని మత్తేవారిగూడేనికి చెందిన గుండుగుంటి మద్దిరావమ్మ తమపై చేతబడి చేస్తుందన్న అనుమానంతో ఆమె బావగారి కుమారుడు గుండుగుంటి వర ప్రసాద్, అతని కుమారులు రాజశేఖర్, నాగరాజు గురువారం ఆమెపై దాడి చేసి, పళ్లు పీకేసిన విషయం తెలిసిందే. అయితే ఘటన జరిగిన రోజు రాత్రి పై ముగ్గురు నిందితులను వారి ఇంటి వద్ద పోలీసులు అరెస్టు చేశారు. వారిని శుక్రవారం భీమడోలు కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు ఎస్సై సుధీర్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు బాలరాజు పరామర్శ



వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకొని కూటమి పార్టీల వారు దాడులు చేయడం అత్యంత హేయమైన చర్యని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. రాజవరంలో ఇటీవల జనసేన నాయకుల దాడిలో గాయపడిన తమిర్చి దుర్గారావును బాలరాజు శుక్రవారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు కూటమి శ్రేణుల దాడులను ఎదుర్కొంటూ ధైర్యంగా నిలబడగలుగుతున్నారన్నారు. కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అండగా నిలబడుతుందని ఆత్మస్థైర్యం కోల్పోవద్దని సూచించారు. అనంతరం మైనారిటీ సెల్ నాయకులు ఎస్కే మస్తాన్ కుమారుడు రంజాన్‌ను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, సర్పంచి ఏలేటి చిన్న తుక్కయ్య, ఎస్సీ సెల్ నాయకులు బ్రహ్మన్న, గ్రామ కన్వీనర్ శ్రీరంగం విశ్వనాథం, ఉప సర్పంచ్ నేలపోలు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి ప్రకాశం జయంతి



ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు దేశానికి ఎనలేని సేవ చేశారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. అనంతరం రాజనీతి శాస్త్రం అధ్యాపకుడు ధారావతు మల్లేష్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం అని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.ఇందిరాకుమారి, ఎం.ఉషారాణి, ధారావతు మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152 వ జయంతి శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించారు. లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో చిన్నారులు ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్కూలు విద్యార్థులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విలీన మండలాలపై వివక్ష తగదు



సమావేశంలోమాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి బాడిశ రాము

వేలేరుపాడు: పోలవరం ముంపు పేరుతో విలీన మండలమైన వేలేరుపాడు మండలంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం నిలిపివేయడం తగదని, సీపీఐ మండల కార్యదర్శి బాడిశ రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు అన్నారు. శుక్రవారం వేలేరుపాడు సీపీఐ కార్యాలయంలో కారం దారయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ విలీన మండలాల పేరు చెప్పి గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూడా పనులు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో కూడా వీరికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. గత 20 సంవత్సరాల నుంచి గ్యాస్ కనెక్షన్ పుస్తకాలు తెలంగాణలోని సారపాక గ్యాస్ కంపెనీ పేరు మీద ఉన్నాయని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత గ్యాస్ సిలిండర్లు ఆ లబ్ధిదారులకు వర్తించవని చెబుతున్నారని, మండలంలోని ప్రతి ఒక్కరికి ఉచిత గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్ జిల్లా కౌన్సిల్ సభ్యులు కరటం వెంకటేశ్వర్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రా మధు, పిట్టా వీరయ్య, కురిమెళ్ల వెంకటేశ్వర్లు, బందం నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

పోలవరం రూరల్: రాష్ట్రంలోని పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు అన్నారు. అచ్యుతాపురం ఫార్మా సంఘటనలో మృతి చెందిన కార్మికులకు సంతాపం తెలిపారు. ఆందోళనకు సంఘీభావం తెలిపారు. కార్మికుల కుటుంబాలకు నష్ట పరిహారం అందించాలన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

కుక్కునూరు: అచ్యుతాపురం ఎసెన్షియా కంపెనీ విస్ఫోటనంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని సీపీఐ.ఎం ఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు షేక్ గౌస్ డిమాండ్ చేశారు. పారిశ్రామిక వేత్తలకు అనుకూలమైన కార్మిక అధికారులను వెంటనే తొలగించాలన్నారు. 18 మంది కార్మికుల మృతికి కారణమైన అమెరికా ఎసెన్షియా ఫార్మా కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. రూ.2 కోట్లు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.